తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి | పెద్దపల్లి | జగిత్యాల

శుక్రవారం 10 ఏప్రిల్ 2026 | పేజీలు : 8

Follow :


## రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- తేమ వచ్చిన 24 గంటల్లోనే ధాన్యం కొనుగోలు, మిల్లులకు తరలింపు
- అనధికార మిల్లర్లకు ధాన్యం పంపితే కఠిన చర్యలు
- చిన్న రైతులకు ప్రాధాన్యం - వివక్ష లేకుండా కొనుగోలు జరగాలి
- ఆన్‌లైన్ నమోదు 24 గంటల్లో 100% పూర్తి చేయాలి



**పెద్దపల్లి,ఏప్రిల్ 09(జనంసాక్షి)** జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేసి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రబీ ధాన్యం కొనుగోలు పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధారించామని, ఏప్రిల్ లో కొనుగోలు ప్రారంభించి మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. తేమ శాతం వచ్చిన వెంటనే 24 గంటల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొన్ని కొనుగోలు కేంద్రాలు కేటాయించని మిల్లర్లకు ధాన్యం పంపిస్తున్నట్లు గమనించామని, యాసంగి సీజన్‌లో ఇది పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.ఆకస్మిక వర్షాల నేపథ్యంలో ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన హమాలి కార్మికులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హమాలి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తేమ ధాన్యాన్ని ముందుగా ఎత్తివేయాలని, ఎటువంటి వివక్ష లేకుండా కొనుగోలు జరగాలని స్పష్టం చేశారు. రామగిరి గ్రామ సభలో చిన్న రైతుల ధాన్యం ముందుగా కొనుగోలు చేయలేదని వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చిన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలోపు కేటాయించిన మిల్లులకు తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు క కేంద్రాల్లో నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని సంచుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌ల ద్వారా 24 గంటల్లో 100% ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## క్రమశిక్షణ ఉల్లంఘించిన అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత సస్పెండ్

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష..

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, క్రమశిక్షణ ఉల్లంఘించిన అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత ను సస్పెండ్ చేస్తూ ×జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.రామగుండం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి నాగ్ల మల్యాల స్వర్ణలత, తనపై అధికారుల పట్ల అత్యంత దురుసుగా ప్రవర్తిస్తూ,దుర్భాషలాడినట్లు ఫిర్యాదులు అందాయని. ఈ ప్రవర్తన ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని, తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యమని ప్రాథమిక విచారణలో తేలిందని, ఉన్నతాధికారుల నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి సదరు అంగన్‌వాడీ టీచర్‌ను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ తన ఉత్తర్వుల్లో తెలిపారు.ఈ సస్పెన్షన్ ఆదేశాలు సదరు టీచర్‌పై పూర్తిస్థాయి విచారణ పూర్తయ్యి, తదుపరి చర్యలు తీసుకునేంత వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, క్రమశిక్షణ తప్పినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## ఈవీఎం గోదాం ను తనిఖీ చేసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (జనంసాక్షి)** కలెక్టరేట్ సమీపం లో గల ఈవీఎం గోదాం ను గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ చేశారు.ప్రతీ నెల నిర్వహించే నియమిత తనిఖీలలో భాగంగా ఈవీఎం గోదాంను సందర్శించి పరిశీలించారు. గోదాంలో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, డబుల్ లాక్ సిస్టమ్, ఫైర్ సేఫ్టీ పరికరాలు తదితర అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గోదాంలో భద్రపరచిన ఈవీఎంల స్థితి, నిర్వహణ విధానం, రికార్డుల నిర్వహణపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు.అనంతరం వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో ఎన్ వి గిరి, తహసీల్దార్ హిమబిందు, రెవెన్యూ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో అంతర్గాం ఆర్ఐ శ్రీమాన్



**గోదావరిఖని, జనంసాక్షి :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శ్రీమాన్ పదివేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. రాయదండి గ్రామానికి చెందిన రైతు వెంకటస్వామి భూమి ఎంక్వైరీ కి సంబంధించి రూ.10 వేలు లంచం డిమాండ్ చేయడంతో సదరు రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. తహసీల్దారు కార్యాలయంలో ఉన్న ఆర్ఐ శ్రీమాన్ కు రైతు వెంకటస్వామి లంచం డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వెంటనే కేసు నమోదు చేసుకుని ఐదు గంటల పాటు విచారణ చేశారు. అనంతరం ఆర్ఐ శ్రీమాన్ ను అదుపులోకి తీసుకొని కరీంనగర్ ప్రత్యేక కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్' ఛాంబర్ ను తొలగించాలని కలెక్టర్ కు వినతి పత్రం

### కరీంనగర్ నగరపాలక సంస్థ కాంగ్రెస్ పార్టీ డివిజన్ కార్పొరేటరర్లు



**కరీంనగర్, ఏప్రిల్ 09 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థలో డిప్యూటీ మేయర్ ఛాంబర్ ఏర్పాటు చేయకూడదని తెలంగాణ మున్సిపల్ చట్టంలో ఉన్నప్పటికీ బుధవారం రోజు చాంబర్ ను ఏర్పాటు చేసినందున, తొలగించాలని నగరపాలక సంస్థ కాంగ్రెస్ పార్టీ డివిజన్ కార్పొరేటర్లు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019లో సెక్షన్ 20 (3) ప్రకారం డిప్యూటీ మేయర్ పదవి సేకరణ మాత్రమే పేర్కొనబడిందని, కానీ ప్రత్యేకంగా ఛాంబర్ గది కేటాయింపు గురించి ఎటువంటి నిబంధనలు లేనందున డిప్యూటీ మేయర్ చాంబర్ కేటాయించకూడదని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ల గతంలో మున్సిపల్ కమిషనర్ కి రిప్రజెంటేషన్ ఇచ్చామని తెలిపారు. బుధవారం రోజున మున్సిపల్ కార్పొరేషన్ లో స్వయంగా డిప్యూటీ మేయర్ ప్రత్యేక గదిని కేటాయించుకొని అందులో కూర్చోవడాన్ని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ల పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, చట్టంలో లేనిది కార్పొరేషన్ లో అదనపు భారంగా, చట్టానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే రద్దుచేసి, ఆ గది కేటాయింపు ఆపవలసిందిగా జిల్లా కలెక్టర్ ను నగరపాలక సంస్థ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు వినతి పత్రం ద్వారా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యుల అంజన్ కుమార్, మల్లికార్జున రాజేందర్, వరాల నర్సింగం,చాడగొండ కవితా బుచ్చిరెడ్డి, సరేల రాజకుమారి- ప్రసాద్,గుమ్మడి రాజ్ కుమార్, ఎన్ భాస్కర్ నాయక్, పార్వతుల మల్లేశం, గంటా శ్రీనివాస్, కాంతాల జగన్ రెడ్డి, పడాల శ్రీజ-అజయ్, ఆకుల నందిని, ఆకుల - నర్మదా నర్సయ్య, పొడి శెట్టి వసంత - భూమయ్య, కల్లపల్లి శారద-బాలరాజు, మహమ్మద్ ఫరీనా ఈకరం సికందర్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కార్పొరేషన్‌లో కో-ఆప్షన్ సభ్యుల ఎంపికకు నోటిఫికేషన్



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 9 (జనంసాక్షి)** కరీంనగర్ నగర పాలక సంస్థలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపికకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం కలిగిన ముగ్గురు సభ్యులు (ఒక మహిళ, ఇద్దరు పురుషులు) మరియు మైనారిటీ వర్గాలకు చెందిన ఇద్దరు సభ్యులను ఎంపిక చేయనున్నారు.అభ్యర్థులు కరీంనగర్ ఓటర్ జాబితాలో నమోదు అయి, కనీసం 21 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. అలాగే మున్సిపల్ లేదా గ్రామ పంచాయతీ స్థాయిలో అనుభవం, లేదా గెజిటెడ్ ఉద్యోగిగా సేవలు చేసిన అనుభవం వంటి అర్హతలు ఉండాలి.ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన పత్రాలతో ఏప్రిల్ 16, 2026 సాయంత్రం 5 గంటలలోపు కమిషనర్‌కు దరఖాస్తు సమర్పించాలి. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు పరిగణించబడవు.

# వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో అక్రమ ఇసుక ట్రాక్టర్ల ఆగడాలు

## గ్రామపంచాయతీ 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్



**జమ్మికుంట, ఏప్రిల్ 9 (జనం సాక్షి):**జమ్మికుంట మండలం వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో గత మూడు నెలలుగా కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణా గ్రామ ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీస్తోందని గ్రామ పంచాయతీ 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ అన్నారు.ఈ సందంర్భంగా బండారి ప్రశాంత్ మాట్లాడు తూ వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ (పాత కోరపల్లి గ్రామపంచాయతీ )పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని, చెక్‌పోస్ట్ కారణంగా ఇసుక మాఫియా కార్యకలాపాలు గ్రామంలోని అంతర్గత వీధుల వైపు మళ్లి రోజుకు కనీసం 300కు పైగా ట్రాక్టర్లు అధిక వేగంతో రాకపోకలు సాగిస్తున్నాయని వివరించారు.దీంతో గ్రామంలోని రోడ్లు తీవ్రంగా దెబ్బతిం టున్నాయని, దుమ్ము,శబ్ద కాలుష్యం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్లపై నడవడం కూడా ప్రమాదకరంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఎప్పుడు ఏ ట్రాక్టర్ వేగంగా వస్తుందో తెలియని భయానక పరిస్థితి నెలకొందని గతంలో చిన్నపాటి ప్రమాదాలు జరిగినప్పటికీనీ అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ తో పాటు గ్రామ ప్రజలు ఉన్నారు.

# కరీంనగర్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభం



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 9 ( జనం సాక్షి )**కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ ఫంక్షన్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఘనంగా జరిగింది. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల శాఖ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేయగా, దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## సింగరేణి సూపర్ బజార్లో..

# నిత్యవసర వస్తువుల కొరత లేకుండా చూడాలి

**గోదావరిఖని, జనంసాక్షి :**రామగుండం రీజియన్ ఆర్జీ.వన్ పరిధిలోని గోదావరిఖనిలో గల ప్రధానమైన సూపర్ బజార్లో సింగరేణి కార్మికులకు నిత్యవసర వస్తువుల కొరతను ఎదుర్కోవడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టివి ఆనంద్ వర్ధన్ పేర్కొన్నారు. ప్రతినెల సింగరేణి కార్మికులకు నిత్యవసర వస్తువులను సరఫరా చేసే సూపర్ బజార్లో నిత్యవసర వస్తువులు కొరత ఏర్పడడంతో కార్మిక కుటుంబాలు ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని ఆనంద్ వర్ధన్ పేర్కొన్నారు. ఇంత పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి సమస్త అద్వర్యంలో నడుస్తున్న సూపర్ బజారులో నిత్యవసర వస్తువులు తీసుకురాకపోవడానికి గల కారణాలు ఏమిటి అని కార్మిక కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయని టీపీ ఆనంద్ ప్రశ్నించారు.కార్మికుల సంక్షేమం కొరకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్తున్న అధికారులు సూపర్ బజార్లో నిత్యవసర వస్తువులు తెప్పించకపోవడంలో అభ్యంతరం ఏమిటి అని ప్రశ్నించారు.ప్రతి నెల నిత్యవసర వస్తువులు అందుబాటులో లేకపోవడం వల్ల కార్మిక కుటుంబాలు బయట షాపులలోని వ్యాపారస్తులకు వద్దకు వెళ్లి నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సూపర్ బజార్లో నిత్యవసర వస్తువులు తీసుకురావడానికి నిర్లక్ష్యం చేస్తున్న సంబంధిత అధికారులు కావల్సుకొని సూపర్ బజార్లోకి నిత్యావసర వస్తువులు తీసుకురాకుండా బయట వ్యాపారులకు ఈ రకంగా లాభం చేకూర్చే విధానాలు చేయడం జరుగుతుందనే అనుమానాలను కార్మిక కుటుంబాలు వ్యక్తం చేస్తున్నాయని టిపి ఆనంద్ వర్ధన్ పేర్కొన్నారు. సూపర్ బజార్లో నిత్యవసర వస్తువుల కొరతను తగ్గించే ప్రయత్నం నూతనంగా వచ్చిన సింగరేణి ఎండి ప్రకాష్ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి పి ఆనంద్ వర్ధన్ కోరారు.

# శ్రీపాద రావు వర్ధంతి వేడుకలకు సర్వం సిద్ధం చేసిన నాయకులు



**ముత్తారం ఏప్రిల్ 09:(జనంసాక్షి )** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాద రావు 27వ వర్ధంతి వేడుకలను ఈ నేల 13న పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం కేషన్ పల్లి గ్రామంలో నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు..గురువారం కేషన్ పల్లి, గ్రామంలో ఉన్న శ్రీపాద రావు విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజి మాజీ జడ్పిటిసిలు చొప్పరి సదానందం, నాగినేని జగన్ మోహన్ రావు మాట్లాడుతూ శ్రీపాద రావు వర్ధంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని శ్రీపాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరుగుతుందని అన్నారు.అనంతరం శ్రీపాద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శాస్త్ర చికిత్సలో పాల్గొని పుష్పగిరి ఆసుపత్రిలో ఉచిత కంటి శాస్త్ర కార్యకలాపం చేపించుకున్న వారికి కంటి అద్దాలను పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అంబటి చంద్రంమొగిలి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తాళ్లపల్లి కుమార్,కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు బియ్యాని శివ కుమార్,మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గాధం శ్రీనివాస్,మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాజిద్ పాషా,మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు ఎడవేన సంపత్,మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు అల్లం కుమారస్వామి, మండల యువజన అధ్యక్షుడు బక్కతట్ల వినీత్,కమాన్ పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుచ్చం రావు,కేడీసీసీ మాజీ చైర్మన్ యాదగిరి రావు,కాంగ్రెస్ పార్టీ వివిధ గ్రామాల అధ్యక్షులు,సర్పంచ్లు,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఇంటర్ విద్యార్థులకు ఉచిత ఇంటర్న్ష్ తరగతులు పూర్తి



**ముత్తారం ఏప్రిల్ 08(జనంసాక్షి)** పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం ధర్యాపూర్ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదివిన విద్యార్థులకు బ్యూటీ, వెల్నెస్ ,రిటైల్, మార్కెటింగ్,విభాగలలో ఉచిత ఇంటర్న్షిప్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కే. సంతోష్ కుమార్ తెలిపారు.విద్యార్థులలో వృత్తి నైపుణ్యాలు ,కమ్యూనికేషన్ సామర్థ్యాలు,వ్యక్తిత్వ వికాసం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందిం చేందుకు ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందిం చినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రత్యేక వృత్తి విద్యా ఆచరణాత్మక అంతర్గత నైపుణ్య శిక్షణ ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో వారి అభిరుచిని బట్టి ప్రస్తుత నవతరంలో మెరుగైన స్వయం ఉపాధి అవకాశాలతో విద్యార్థుల జీవితంలో స్వశక్తితో ఆర్థిక చేకూర్పు ఆదాయ వనరుగా స్థిరపడుతూ ఇంకా కొంతమందికి ఉపాధి అవకాశాలను కల్పించే శక్తులుగా ఎదుగుటకు ఇది ఒక అరుదైన సదవకాశమని ఇంటర్ విద్యా సర్టిఫికెట్ తో పాటు,వృత్తి విద్యా సర్టిఫికెట్ కూడా సమాంతరంగా పొందుతారని .ఒక్కో విద్యార్థి రెండు సర్టిఫికెట్స్ పొందడం వల్ల ఉపాధి అవకాశాలుమెరుగుపడుతాయాన్ని. ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు సదుపాయాలు కల్పించి శిక్షణ తరగతులు నిర్వహించడంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పూర్తిస్థాయి పర్యవేక్షకులుగా వృత్తి విద్యా అధ్యాపకులు రత్న గోలి, వెంకటరాజం ఎజ్జు,సు శిక్షితులు స్వప్న- మహాలక్ష్మి బ్యూటీ పార్లర్ మంథని ,రాజు,ఆదిశక్తి ఏఎస్ మార్ట్ సూపర్ బజార్ మంథని, ప్రధాన భూమిక పాత్రలను పోషించరాని కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ గురువారం తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# రామగుండంలో బిఎల్ఓలుగా రాజీనామా చేసిన 114 మంది ఆర్పీలు

## బిఎల్ఓలుగా దూర ప్రాంతాలకు పంపడం ద్వారా ఆర్పీలపై ఆర్థిక భారం

**గోదావరిఖని, జనంసాక్షి :**రామగుండం నియోజకవర్గంలో బూతు లెవెల్ అధికారులుగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్పీలు 2016 నుంచి వారికి అనుకూలమైన ప్రాంతంలో పని చేస్తున్న వారిని రెవెన్యూ అధికారులు కొంతమంది ఆర్పీలను దగ్గరి ప్రాంతం నుండి దూర ప్రాంతాలకు పంపడం వల్ల ఆర్పీ లపై ఆర్థిక భారం పడుతుంది. ఆర్పీలు ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కు చెందిన వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి ఇప్పించేందుకు తమ విధులను నిర్వర్తించడం జరుగుతుంది. ఇది కాకుండా అదనంగా ఆర్పీ లు బి.ఎల్.ఓ విధులు కూడా ఎలాంటి బెనిఫిట్ లేకుండా అదనంగా చేయడం జరుగుతుంది. ఆర్పీ లు స్వంతం గా డబ్బులు పెట్టుకుని రవాణా భారాన్ని మోయడం వల్ల వారు ఆర్థికంగా నష్టపోతున్నారు, ఎందుకంటే ఆర్పీలకు గౌరవ వేతనం కూడా 6 వేలు మాత్రమే ఇస్తారు, అదనంగా బి.ఎల్.ఓ లు గా పని చేస్తున్న ఆర్పీ లకు ప్రభుత్వం ఎలాంటి రవాణా ఖర్చులు కూడా ఇవ్వడం లేదు. కనుక దూర ప్రాంతాల కు బి.ఎల్.ఓ లు గా ఆర్పీలు వెళ్ళేందుకు సుముఖంగా లేరు, కొంత మంది అధికారులు ఆర్పీ లను దూర ప్రాంతాలకు వెళ్ళాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నందున 114 మంది ఆర్పీ లు బి.ఎల్.ఓ లు గా విధులు నిర్వహించలేమని పేర్కొంటూ రాజీనామా చేయడం జరిగిందని, కనుక జిల్లా కలెక్టర్ స్పందించి దూర ప్రాంతాలకు బి.ఎల్.ఓ లు గా ఆర్పీలను పంపకుండా దగ్గర ఉన్న ప్రాంతాలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్పీ లు కోరుతున్నారు.



# ఆర్మ్డ్ పోలీస్ అధికారుల భవన నిర్మాణ పనులను పరిశీలించిన సీపీ



**గోదావరిఖని, జనంసాక్షి:**రామగుండం పోలీస్ కమిషనరేట్ సాయుధ బలగాల అధికారుల, సిబ్బంది క్వార్టర్స్ నూతన భవనాల నిర్మాణ పనులు పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో సీపీ అధికారులతో కలిసి పనులను పరిశీలిం చారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తిచేయాలని, ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తిచేసి, ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీపీ వెంట పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీని వాస్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రామగుండం ట్రాఫిక్ ఇన్స్పె క్టర్ రాజేశ్వర్ రావు ,ఆర్ ఐ లు శేఖర్, రమేష్ ఉన్నారు.

# రైతన్నల చెంతకు విద్యుత్ సేవలు

### పొలంబాటలో మున్సిపల్ చైర్మన్, విద్యుత్ సిబ్బంది



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (జనంసాక్షి)**రైతాంగానికి సాగు నీరు అందించడంలో కీలకమైన విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలను తొలగించి, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, విద్యుత్ శాఖ ఏఈ సిద్ధార్థతో కలిసి లాలపల్లి లోని పొలాల వెంట తిరుగుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగు భూముల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడం, ఒరిగిన స్తంభాలను సరిచేయడం ట్రాన్స్ఫార్మర్ల వద్ద పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించడం వంటి పనులను సిబ్బంది తక్షణమే చేపడుతున్నట్లు చైర్మన్ వివరించారు. అధికారులు, సిబ్బంది నిత్యం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ విద్యుత్ లైన్ క్లియరెన్స్ పనులు చేపట్టడం వల్ల రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందుతుందన్నారు.ఏఈ సిద్ధార్థ మాట్లాడుతూ నూతన విద్యుత్ కనెక్షన్లు కావాల్సిన రైతుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న వెసులుబాటులో కిలోమీటర్ పరిధిలో కొత్త కనెక్షన్లు పొందేందుకు రైతులు మీ-సేవా కేంద్రాల్లో కేవలం రూ 4వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అధికారులే నేరుగా తమ వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించడం పట్ల స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పొలం బాట కార్యక్రమం క్షేత్రస్థాయిలో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తోందన్నారు. ఈ పొలం బాట కార్యక్రమంలో విద్యుత్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# గో ఆరాధన ఉద్యమానికి ప్రతి ఒక్కరి మద్దతు అవసరం

### ఈ నెల 27న తహసీల్దార్ కార్యాలయాల్లో వినతుల అందజేత

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా..



**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 09:(జనం సాక్షి )**జాతీయస్థాయిలో చేపట్టిన గో ఆరాధన ఉద్యమానికి ప్రతి ఒక్క హిందువు మద్దతు ఎంతో అవసరమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. అఖిల భారత గో సమ్మాన్ అభియాన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి రాజ్యాంగానుసారంగా అహింసా మార్గంలో గో సంరక్షణ కొరకు ఆరాధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రధానంగా దేశంలో సంపూర్ణ గోహత్య నివారణ చేయడం, గోవును దేశమాతగా ఆరాధ్యనీయ దేశదేవతగా గుర్తించాలన్నారు. అలాగే గో పరిరక్షణ చట్టం, బోర్డును తీసుకురావాలని అన్నారు. వీటిని సాధించేందుకు ఈ నెల 27న జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గో సమ్మాన్ అభియాన్ ప్రతినిధులు అనిల్ గోపాల్, కుషాల్ దాస్, భూపాల్ సింగ్, వీహెచ్ పీ గో రక్ష విభాగం తెలంగాణ ప్రాంత కృషి ప్రముఖ్ ధాత్రిక రమేష్, ఇందూరు గో సేవా సమితి అధ్యక్షుడు వీరమల్లి రమేష్, లక్ష్మీ కాంతం, యాదగిరి, రజినీకాంత్,ఎ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పసుపురైతుల పరీస్థితి అగమ్యగోచరం

### ఈనామ్ బంద్ దళారుల సిండికేట్

### పాతపద్ధతిలోనే పసుపు కొనుగోలు రైతుల ఆందోళన



**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 09:(జనం సాక్షి )**దేశంలోనే పసుపుబోర్డు కేంద్రం నిజామాబాద్ జిల్లాలో ఉంది. అలాంటి నిజామాబాద్ మార్కెట్ యార్డ్ లో పసుపు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.పసుపు కు ధర ఉంది అని సంతోష పడాల, లేక దళారుల మోసాలకు ఆందోళన చెందాల అనే దయనీయ పరిస్థితి రైతు ది.గడిచిన వారం రోజుల నుండి ఈ నామ్ ఆన్లైన్ పద్ధతి బందు చేసి పాత పద్ధతీ లో బీట్ చేస్తున్నారు.ఇదే అదునుగా దళారులు సిండికేట్ అయ్యి ధర పెట్టక రైతులను మోసం చేస్తున్నారు.ఈ నామ్ పద్ధతి ఉంటే దేశం లో ఉన్న అన్ని ప్రాంతాల వ్యాపారులు బిడ్డింగ్ లో పాల్గొంటే,రైతులకు ధర వచ్చేది పసుపు బోర్డు ఏర్పాటు చేసాం అని గొప్పలు చెప్పుకునే స్థానిక పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ ఎం చేస్తున్నారు.ధర పెరిగితే మేమే చేసాం అని గొప్పలు చెప్పుకునే ఎంపీ మీ పసుపు బోర్డ్, మీ పనితనం మార్కెట్ యార్డ్ కు వస్తే తెలుస్తుంది.స్థానికంగా ఉండే మన మార్కెట్ యార్డ్ లో ఏం జరుగుతుందో తెలుసుకోలేని మీరు రైతులని ఎం ఆదుకుంటారు. ఇకనైనా అరవింద్ చొరవతీసుకొని ఈ నామ్ పద్ధతిలో పసుపు కొనుగోలు చేసే విధంగా చూడాలని ఆవేదనతో రైతులు కోరారు.

## ఎయిడ్స్ అవగాహన ర్యాలీ, హెల్త్ క్యాంప్ నిర్వహణ



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 9 ( జనం సాక్షి )**కరీంనగర్ నగరంలోని జ్యోతి నగర్లో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ డా. వెంకటరమణ ఆధ్వర్యంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డా. సుధా జెండా ఊపి ప్రారంభించారు.ర్యాలీ అనంతరం లేబర్ అడ్డా వద్ద హెల్త్ క్యాంప్ నిర్వహించి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ఎయిడ్స్‌పై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సుధీర్, నాక్ స్టాఫ్, చెల్మెడ నర్సింగ్ విద్యార్థులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తె మట్టెలు అందించిన చిట్లేని మాధవి వెంకటేశ్వరరావు

**ముస్తాబాద్ ఏప్రిల్ 9 (జనం సాక్షి )**ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో నిరుపేద కుటుంబం అయిన అల్వాల రాజయ్య కూతురు శ్వేత వివాహానికి చిట్నేని మాధవి వేంకటేశ్వర రావు. పెద్ద మనసుతో పుస్తె మట్టెలు ఇవ్వడం జరిగినది వారికి కుటుంబం తరపున దాన్య వాదములు, ఈ కార్యక్రమంలో. విద్యాసాగర్ రావు, గ్రామ సర్పంచ్ తాటిపల్లి శంకర్, ఉప సర్పంచ్ దగ్గు భవిత నవీన్ వార్డుమెంబర్ కామిరెఅభిగారు గ్రామస్తులు పాల్గోవడం రిగింది.

## 23,000 విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు శాశ్వత నియామకాలు చేయాలంటూ బాన్సువాడలో బిఆర్ఎస్ మద్దతుతో ధర్నా



**బాన్సువాడ ఏప్రిల్ 9 ((జనం సాక్షి)**బాన్సువాడ : రాష్ట్రవ్యాప్తంగా 23,000కు పైగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగాలలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాన్సువాడ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట రెండోవ రోజు కూడా ధర్నా కొనసాగింది. ఈ ధర్నాకు బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ మాట్లాడుతూ--- ప్రతి రోజు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్న విద్యుత్ కార్మికుల భవిష్యత్తు భద్రత ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. వెంటనే పర్మినెంట్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో మాజీ రైతు బందు జిల్లా అధ్యక్షులు అంజి రెడ్డి, ఏఐబీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బోడ రామ్ చంద్ర్, కౌన్సిలర్లు ఖలీల్ ఖాన్, ఫెరోజ్ ఖాన్, మాజీ కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు అక్బర్, మైనారిటీ సెల్ నాయకుడు ఇషాక్, నాయకులు రమేష్ యాదవ్, మన్నే అనిల్ కుమార్, కార్మిక సంఘ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలల పరిరక్షణకు మండల స్థాయి కమిటీ

### సీడీపీవో పుష్పలత



**ముత్తారం ఏప్రిల్ 08(జనంసాక్షి)** బాలల రక్షణ కోసమే గ్రామ, మండల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేశామని సీడీపీవో పుష్పలత అన్నారు.మహిళా శిశు సంక్షేమ శాఖ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం ముత్తారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు తప్పనిసరి అన్నారు.గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా, బాలలందరూ బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు.బాల కార్మికులు లేకుండా, బాలలపై ఎలాంటి వేధింపులు జరగకుండా చూడాలన్నారు.బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా, ఇబ్బందులు పెట్టినా,బాల్య వివాహాలు జరుగుతున్నా 1098 టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.అనంతరం బాలల పరిరక్షణ కమిటీ కరదీపికను కమిటీ సభ్యులకు అందజేశారు. బాలల హక్కులను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.అనంతరం మండల అభివృద్ధి అధికారి సురేష్ ఆధ్వర్యంలో సర్పంచ్లను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి కనుకయ్య,ఐసిడిసి సూపర్వైజర్ స్వప్న, చైల్డ్ సోషల్ వర్కర్ శ్యామల, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ హరీష్ తోపాటు సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బియ్యని శివకుమార్,సర్పంచులు పోతిపెద్ది కవిత,సుధాటి రవీందర్ రావు,మెంగని సమత,రాపెల్లి రాజయ్య, ఊట్ల చరణ్,చొప్పరి సంపత్,కృష్ణవేణి,అన్నపూర్ణ,రాజేశ్వరి,తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి వైద్యుడికి రాష్ట్ర స్థాయి గౌరవం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (జనం సాక్షి)**కామారెడ్డి పట్టణానికి చెందిన ప్రముఖ శిశు వైద్య నిపుణుడు, జనని హాస్పిటల్లో సీనియర్ పీడియాట్రిషన్‌గా సేవలందిస్తున్న డాక్టర్ ఈ. అరవింద్ కుమార్ గౌడ్ ను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లోని కంటిన్యూయింగ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ కమిటీకి కో-ఆప్టెడ్ సభ్యునిగా నియమించారు.నేషనల్ మెడికల్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం, రాష్ట్రంలో వైద్యులు తమ జ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకోవడం తప్పనిసరి. ఈ క్రమంలో ప్రతి వైద్యుడు ప్రతి సంవత్సరం 5 క్రెడిట్ పాయింట్లు సుమారు 40 గంటలు కలిగిన సిపిడి కార్యక్రమాలలో పాల్గొనాల్సి ఉంటుంది.సి పి డి కమిటీ ద్వారా ప్రొఫెషనల్ సంస్థలు, బోధనా సంస్థలకు అక్రెడిటేషన్ ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమాల ద్వారా వైద్యులు తాజా వైద్య పరిజ్ఞానం, ఆవిష్కరణలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. అలాగే మెడికో-లీగల్ అంశాలపై అవగాహన పెంపొందించడంపై కూడా కమిటీ దృష్టి సారిస్తోంది.డాక్టర్ అరవింద్ కుమార్ గౌడ్ నియామకంపై వైద్య వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# సాంఘిక విప్లవ పితామహుడు పూలే



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 9 ( జనంసాక్షి)**
భారత సాంఘిక విప్లవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న ఆయన జయంతిని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. అణగారిన వర్గాల విముక్తి, స్త్రీల సాధికారత, సమాన హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం భారత సమాజాన్ని మేల్కొలిపిన గొప్ప విప్లవంగా నిలిచింది. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించిన పూలే, చిన్ననాటి నుంచే సమాజంలోని అన్యాయాలు, కుల వివక్షను గమనించారు. ఆ కాలంలో నిమ్నకులాలు, స్త్రీలకు విద్య నిషేధం ఉండేది. ఈ అన్యాయాన్ని ఎదిరిస్తూ విద్యే విముక్తికి మార్గమని ఆయన నమ్మారు. అందుకే అణగారిన వర్గాల కోసం పాఠశాలలు ప్రారంభించి, స్త్రీలకు విద్య అందించడంలో ముందుండారు. ఈ ఉద్యమంలో ఆయనకు అండగా నిలిచినది ఆయన సహచరి సావిత్రీబాయి పూలే. ఆమెను చదివించి, దేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయిగా తీర్చిదిద్దడం పూలే దంపతుల గొప్ప కృషి. వారు కలిసి బాలికల విద్యకు పునాది వేసి, సమాజంలో మార్పుకు నాంది పలికారు. పూలే కేవలం విద్యా సంస్కర్త మాత్రమే కాదు, గొప్ప రచయిత కూడా. ఆయన రచించిన గులామగిరి వంటి గ్రంథాలు కులవ్యవస్థపై తీవ్ర విమర్శలు చేసి, సామాజిక చైతన్యాన్ని పెంచాయి. అలాగే 'సత్యశోధక సమాజ్' అనే సంస్థను స్థాపించి, సమానత్వం కోసం ఉద్యమాన్ని విస్తరించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన పూలేను తర్వాత కాలంలో డా. బి.ఆర్. అంబేద్కర్ తన గురువుగా భావించారు. పూలే చూపిన మార్గం భారత రాజ్యాంగ రూపకల్పనలో కూడా పరోక్షంగా ప్రభావం చూపింది. కుల వివక్షకు వ్యతిరేకంగా, సమాన హక్కుల కోసం, స్త్రీ సాధికారత కోసం జీవితాంతం పోరాడిన మహాత్మ జ్యోతిరావు పూలే నిజమైన సాంఘిక విప్లవ పితామహుడు. ఆయన ఆశయాలు నేటికీ సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నాయి.

# ఈనెల 24న భవన నిర్మాణ కార్మిక సంఘం మండల సమావేశాన్ని విజయవంతం చేయాలి

**ప్రతి గ్రామం నుండి అధ్యక్ష,కార్యదర్శులు పెద్ద ఎత్తున తరలి రావాలి..**

**విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు గందె కొమురయ్య,ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య..**



**చిగురుమామిడి ఏప్రిల్09(జనంసాక్షి):**
ఈ నేల 24న చిగురుమామిడి మండల కేంద్రంలో నిర్వహించే మండల సమావేశానికి మండలంలోని 17గ్రామాల నుండి అధ్యక్ష,కార్యదర్శులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గందె కొమురయ్య,ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్యలు పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గందే కొమురయ్య, ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్యలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న భవనిర్మాణ సంక్షేమ బోర్డు ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేయడం జరుగుతుందన్నారు. అన్ని కార్మిక సంఘాలు కలిసి కొట్లాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తుందని, 44చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి భవన నిర్మాణ కార్మికుల పొట్ట కొడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో దేశంలో సిఏసి సెంటర్ పెట్టి భవనిర్మాణ కార్మికులు రక్త పరీక్షలు చేసుకోవాలంటూ లేకుంటే మీ కార్డులు రద్దు చేస్తామని చెప్పి బెదిరింపులకు గురి చేయడం వలన కార్మికులు వచ్చి రక్తం ఇచ్చిన కార్మికునికి ఉపయోగం లేదు ఒక కార్మికునికి 3500చొప్పున సంక్షేమ బోర్డులు చెలి నిధులు విడుదల చేసి సంక్షేమ బోర్డుకు గండి పెట్టడం జరుగుతోందని, వెంటనే రద్దు చేయాలని ఆయన అన్నారు. మీ సేవలో తంబు సిస్టం రద్దుచేసి పాత పద్ధతిలోనే చేయాలని ఆయన అన్నారు. జిల్లాలోనే పెండింగ్ క్లైమ్లను వెంటనే అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని చెప్పి డిమాండ్ చేశారు. చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల నుండి భవన నిర్మాణ కార్మికులు రాబోయే రోజుల్లో మండలాల మహాసభను ఏర్పాటు చేసుకొని మన సమస్యలపై ముందుండి కొట్లాడి సంక్షేమ బోర్డులో నిధులను మళ్లించే కార్యక్రమంపై ఎదురు తిరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 24న మండలంలోని అన్ని గ్రామాల నుండి అధ్యక్ష,కార్యదర్శులు మండలానికి హాజరై మండలంలో జరుగుతున్నటువంటి సమస్యలపై మాట్లాడుకుని మండల మహాసభలకు ఏర్పాటు చేసుకోవడానికి భవనిర్మాణ కార్మికులందరికీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టల తిరుపతి,జనుల కనకయ్య, పెనుకుల సదానందం,జిల్లెల్ల రమేష్,చిట్టెల మల్లేష్, అనూవోజు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టిపిసిలో స్వచ్ఛతా అభియాన్ కమ్ యోగాభ్యాస్ డ్రైవ్

**గోదావరిఖని, జనంసాక్షి :**
ఎన్టిపిసి రామగుండంలో స్వచ్ఛత అభియాన్ కం యోగబ్యాస్ డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హెచ్ఓడి (ఓ) మనోజ్ కుమార్ ఝా మార్గదర్శకత్వంలో, ఎన్టిపిసి రామగుండం ఆపరేషన్ విభాగం ఎకో పార్క్ సమీపంలోని ఆరోగ్య పాత్ వద్ద స్వచ్ఛతా అభియాన్ కమ్ యోగాభ్యాస్ డ్రైవ్ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ గ్రూప్స్ 1 అండ్ 2 నుండి ఉత్సాహభరితమైన భాగస్వామ్యం కనిపించింది. హెచ్ఓపి అండ్ ఇడి (ఆర్ అండ్ టి) సి. కె. సమంత, జిఎం (ఓ అండ్ ఎం) మనీష్ అగర్వాల్ ఈ కార్యక్రమానికి విచ్చేసి దానిని మరింత శోభాయమానం చేశారు. సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సమంత టౌన్షిప్ను పరిశుభ్రంగా మరియు చెత్త రహితంగా నిర్వహించాల్సిన ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు మరియు పరిశుభ్రతను రోజువారీ అలవాటుగా అలవర్చుకోవాలని ఉద్యోగులను ప్రోత్సహించారు. ఈ డ్రైవ్లో భాగంగా, ఉద్యోగులు పరిశుభ్రతా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు, తద్వారా పర్యావరణ బాధ్యత మరియు పౌర స్పృహ స్ఫూర్తిని పెంపొందించారు. దీని అనంతరం, యువ ఇంజనీర్ల చురుకైన భాగస్వామ్యంతో శారీరక దృఢత్వం మరియు శ్రేయస్సును ప్రోత్సహిస్తూ తేలికపాటి యోగా మరియు వ్యాయామ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం పరిశుభ్రతను శ్రేయస్సుతో విజయవంతంగా అనుసంధానించి, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాలపై అవగాహన కల్పించింది. ఇటువంటి ప్రయత్నాలు స్వచ్ఛత, శ్రేయస్సు మరియు సామాజిక బాధ్యత పట్ల ఎన్టిపిసి రామగుండం యొక్క నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తాయి.

# అల్లాపూర్ గ్రామంలో సిసి రోడ్ పనులు ప్రారంభించిన సర్పంచ్ విజయ పోచయ్య

పిట్లం ఏప్రిల్ 09(జనం సాక్షి)
పిట్లం మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ పంచాయతీ 3 వార్డులో ఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధుల 5 లక్షల వ్యాయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ విజయ పోచయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామంలో సిసి రోడ్లు లేని చోట సీసీ రోడ్లు వేస్తున్నాం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రోడ్ల నిర్మాణంలో అభివృద్ధికి పునాదులు పడుతున్నాయని తెలిపారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోలన్ నాగేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా మహాత్మా జ్యోతిబాపులే జయంతి వేడుకల నిర్వహణ..

**- ఆర్జీ-1 యస్.ఓ టు జియం కే.చంద్రశేఖర్ సమీక్ష..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి ఆర్జీ.1 జియం కార్యాలయ సమావేశాహాలులో సింగరేణి యాజమాన్యం ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా పులే జయంతి వేడుకల ఏర్పాట్లపై బిసి లైజన్ ఆఫీసర్,పెరుమాళ్ళ శ్రీనివాస్, బిసి, ఓబిసి సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఈ సందర్భంగా యస్.ఓ టు జియం కే చంద్రశేఖర్ మాట్లాడుతూ జయంతి వేడుకలను అన్ని గనులు డిపార్ట్మెంట్ లలో ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు, అవసరమైన ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ విధానం, వేదిక ఏర్పాటు, అతిథుల ఆహ్వానం, పుష్పాంజలి కార్యక్రమం. సభా నిర్వహణ, పాల్గొనే అధికారుల బాధ్యతల కేటాయింపు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.
రామగుండం ఏరియాలో మహాత్మా జ్యోతిబా పులే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, సమగ్రంగా ఏర్పాట్లు చేసినదని తెలిపారు. ఈ సమావేశంలో యస్.ఓ టు జియం కే. చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, పెరుమాండ్ల శ్రీనివాస్, సీనియర్ పి.ఓలు శ్రావణ్ కుమార్, హనుమంత రావు, బిసి ఓబిసి సెక్రటరి బత్తుల పోషం, రాజేందర్, కె. మల్లేశం ఏరియా వర్క్స్ షాఫ్, సివిల్ అధికారులు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ 135 వ జయంతి బహిరంగ సభకు తరలి రావాలి



**ముస్తాబాద్ ఏప్రిల్ 9 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కొమ్మా ట అశోకు పోస్టర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ ఇబ్రాం శేఖర్ రాష్ట్ర అధ్యక్షులు పిలుపుమేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి. 135 వ జయంతి బహిరంగ సభ 14 ఏప్రిల్ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సభ స్థలం మహాత్మా జ్యోతిబాపూలే మైదానం కరీంనగర్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను బహుజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి జిల్లా ఇన్చార్జి సాకల రమేష్, నల్ల సంతోష్ బట్టు పరశురాములు రంగారావు శంకర్ మీసా శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ



**శంకరపట్నం ఏప్రిల్9 (జనంసాక్షి)**శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామంలో గురువారం భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబాల నుంచి చదువుతో ఎదిగిన ప్రొఫెసర్ ఆంజనేయులు, అలాగే డాక్టర్గా, ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా ఎదిగిన తన ప్రయాణాన్ని ఉదాహరణగా చూపుతూ యువత విద్యను ఆయుధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్క చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మార్వో సురేఖ, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల మహేందర్, ఎఐవైయస్ నాయకులు మామిడిపల్లి బాపయ్య, మాజీ జెడ్పిటిసిలూ శ్రీనివాస్ గౌడ్, కొండ్ర స్వరూప, అంబేద్కర్ సంఘాల నాయకులు ఓదెలు, నరసయ్య, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పాత్రికేయులు ముందు ఉండాలి

### - ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**వేములవాడ, ఏప్రిల్ 9 (జనంసాక్షి):** ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులు పాత్రికేయులని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ (ఐ జె యు) నూతన కార్యవర్గాన్ని గురువారం అయన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సామజిక సేవలో, సాంఘిక సేవలో ముందుండి సాంఘీక దురాచారాలను రూపుమాపడం లో పాత్రికేయులది ప్రధాన పాత్ర అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా గా పాత్రికేయులు ముందుకు సాగుతున్నరన్నారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రాపెల్లి శ్రీనివాస్, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కంకణాల సాయి శరత్ బాబు, ప్రధాన కార్యదర్శి ఉల్లెందుల మల్లేశం, కోశాధికారి గడీల ప్రవీణ్, సహాయ కార్యదర్శి మదాం బాబు, కార్యవర్గ సభ్యులు తుపుకారి శ్రీనివాస్, కొక్కుల శ్రీనివాస్, సయ్యద్ హబీబ్ పాషా, గొంగల్ల రవికుమార్, పోకల ఆంజనేయులు, ఎనుగందుల నగేష్, కాజా నయిమోద్దీన్, సీనియర్ పాత్రికేయులు రేగుల దేవేందర్, గోగీకారి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్, పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# విద్యుత్ వైర్ల తొలగింపుతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి లైన్ క్లియర్

### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో శాశ్వత పరిష్కారం



**వేములవాడ,ఏప్రిల్9 (జనంసాక్షి):** వేములవాడ పట్టణంలోని కోరుట్ల రోడ్ భీమేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రమాదకరంగా వెళ్లిన విద్యుత్ వైర్లు కారణంగా ఆగిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఊరట లభించింది. లబ్ధిదారురాలు బింగి రేణుకకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి పైనుండి విద్యుత్ లైన్ వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. సమస్య పరిష్కారం కోసం రేణుక ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆది శ్రీనివాస్, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకునేలా ఆదేశించారు. గురువారం టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులు ప్రమాదకర విద్యుత్ లైన్‌ను తొలగించడంతో ఇంటి నిర్మాణానికి ఉన్న అడ్డంకి తొలగిపోయింది. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో లబ్ధిదారురాలు రేణుక ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను పరిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు, వార్డు కౌన్సిలర్ సంగీత- శ్రీకాంత్ కు బింగి రేణుక కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంగ గిరిధర్ రెడ్డి

### ఉత్తర్వులు జారీ చేసిన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ గౌడ్



**ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 09, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వంగ గిరిధర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచాక జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా సంగీతం శ్రీనివాస్‌ను నియమించడం జరిగింది. అదేవిధంగా జిల్లా కమిటీని గురువారం కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌గౌడ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు వంగ గిరిధర్‌రెడ్డి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈసారి ప్రధాన కార్యదర్శిగా పదవి బాధ్యతను స్వీకరించనున్నారు. ఎన్ఎస్‌యూఐ నుండి కాంగ్రెస్ కార్యకర్తగా ప్రవేశించి దశాబ్దాల నుండి కాంగ్రెస్‌లో పనిచేసిన గిరిధర్‌రెడ్డికి ప్రధానకార్యదర్శి.పదవి రావడం జరిగింది. జిల్లాలో మొత్తం 45 మందితో కూడిన జాబితాను బుధవారం సాయంత్రం రాష్ట్ర అధ్యక్షులు మహేష్ గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వంగ గిరిధర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డుపై వరి ధాన్యాన్ని ఆరబెట్టవద్దు:ఎస్ఐ రాహుల్‌రెడ్డి



**ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 09, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల రైతులు పండించిన వరి ధాన్యాన్ని రైతులు రోడ్లపై ఆరబెట్టవద్దని గురువారం ఎస్ఐ రాహుల్‌రెడ్డి రైతులకు సూచించారు. ఆరబెట్టుకోవడం వలన రాత్రి సమయాల్లో వాటిని గ్రహించలేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని గురువారం ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్‌రెడ్డి అన్నారు. రైతు రోడ్డులపై వరిధాన్యాన్ని ఆరబెట్టడం వలన రాత్రి సమయాలల్లో వాహనదారులు గ్రహించక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి రైతులెవరు రోడ్డుపై వరి ధాన్యాన్ని ఆరబోసి ప్రమాదాలకు కారణం కావద్దని తెలిపారు. ఎవరైనా రోడ్డుపై ధాన్యం ఆరబెట్టిన కారణంగా ప్రమాదాలు జరిగితే అట్టి యజమానిపై చట్టరిత్య చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డిపేట ఎస్ఐ కె. రాహుల్‌రెడ్డి తెలిపారు.

## పిట్లం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులు



**పిట్లం ఏప్రిల్ 09 (జనంసాక్షి)**

పిట్లం మండల నూతన ఎస్ఐ గా గురువారం ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకు ముందు గాంధారి మండల ఎస్ఐ గా విధులు నిర్వహించారు. పిట్లం ఎస్ఐ గా ఉన్న వెంకట్ రావు బాన్సువాడ కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ... మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదుల కు సమన్వయం అందిస్తానని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ మండలంలోని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కృషి చేస్తానని అన్నారు. పర్యవేక్షణకు ప్రజలు ప్రజాప్రతినిధులు సహకార అందించాలని కోరారు. అలాగే మండలంలోని ప్రజలందరూ పోలీస్ వారికి సహకరించాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరీత్యా కఠినంగా వివరించడం జరుగుతుంది అని తెలిపారు.

# నెల 13వ నుంచి నిర్వహించే అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ❍ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- ❍ జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన సి ఎస్





**పెద్దపల్లి,ఏప్రిల్ 09(జనంసాక్షి) :** నెల 13వ నుంచి నిర్వహించే అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి ..రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు.ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమం నిర్వహణపై, సీఎస్ రామకృష్ణారావు, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూలి, రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రజలెందరో ప్రాణాలు కోల్పోతున్నారని, అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను తగ్గించవలసిన బాధ్యత మనందరి మీద ఉందని అన్నారు.ఈ నెల 13నుంచి గ్రామీణ స్థాయిలో, గ్రామ సభలు నిర్వహించి, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో తరచు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు ఏమైనా ఉంటే గుర్తించి, ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. వారం రోజులపాటు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగేలా విద్యార్థులచే ర్యాలీలు, మండల స్థాయి కార్యక్రమాలు, వాహన చోదకులకు కంటి పరీక్షలు, తదితర కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. అన్ని కార్యక్రమాలలో ప్రజలను, ప్రజా ప్రతినిధులను పెద్ద ఎత్తున భాగ్యస్వామ్యం చేయాలని అన్నారు.డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ,లి అధికారులు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి, రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ ,డిసిపి రాంరెడ్డిలి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో నరేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ప్రమోద్ కుమార్ ,మున్సిపల్ మిషనర్లు వెంకటేష్, మనోహర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలు రాకతో గంగమ్మ తల్లికి పూజలు



**వేములవాడ రూరల్, ఏప్రిల్ 9(జనంసాక్షి)** వేములవాడ రూరల్ మండలంలోని ఎదురుగట్ల గ్రామ చెరువులో గోదావరి జలాలు చేరడంతో గురువారం గంగమ్మ తల్లికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఘనంగా పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎదురుగట్ల చెరువుకు గోదావరి జలాలు చేరడం వెనుక ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతర శ్రమ, దూరదృష్టి ఉందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం పట్ల ఆయన చూపుతున్న చిత్తశుద్ధి వల్లే ఈ రోజు చెరువు నిండుగా నీటితో కళకళలాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోయినేనీ కరుణాకర్, గ్రామ సర్పంచ్ కడారి తిరుపతి సంధ్య, అడ్డిక శ్రీనివాసరెడ్డి, జైపాల్ రెడ్డి, పొన్నం మల్లేశం, నేదూరీ నరసయ్య, పాలకుర్తి శంకరయ్య, రోమాల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్లు.రైతులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే-అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఏకగ్రీవం



**ఎలిగేడు,ఏప్రిల్ 09(జనంసాక్షి) :** మహాత్మ జ్యోతిరావు పూలే 200వ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 136వ జయంతి ఉత్సవ కమిటీని స్థానిక కోదండరామ ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా పల్లెర్ల వెంకటేష్ గౌడ్, ముఖ్య సలహాదారులు న్యాతరి పోచయ్య, ఉపాధ్యక్షులు గోప్కి శంకర్, ఇరుగురాల సదానందం, ప్రధాన కార్యదర్శి కవ్వంపల్లి నారాయణ, తాండ్ర అంజయ్య, కార్యదర్శులు జల్లి రమేష్, బోయిని సతీష్, రాయపాక మనోహర్, ఎర్రోల్ల మల్లేశం, ప్రచార కార్యదర్శులు చెవుల అజయ్, అసంపల్లి రవీందర్, వడ్లూరి శ్రీనివాస్, ఎర్రోల్ల శంకర్, కోశాధికారి మల్లారపు అంజయ్య, సహలదారులు బసంపల్లి సర్వయ్య ల కమిటీని ఎలిగేడు మండల కేంద్రంలో అన్ని గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఏర్పాటు సర్పంచులు, కప్పల ప్రవీణ్, కవ్వంపల్లి బాపయ్య, మద్దెల రమాదేవి సంపత్, రంగు లతశ్రీనివాస్, ఉప సర్పంచ్ పొన్నాల అనిల్,మాజీ ప్రజా ప్రతినిధులు మండిగ రాజా నరసయ్య, కవ్వంపల్లి దుర్గయ్య, కాంపెల్లి ప్రభాకర్, కుల సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ ఎలిగేడు మండల అధ్యక్షులు బాసంపల్లి శ్రీనివాస్, బడే కొండయ్య, బాసంపల్లి వినోద్, నమలికొండ లచ్చయ్య, ఇరుకుల్ల సచిన్, కవ్వంపల్లి సంపత్, శంకర్ ల అంధ్వర్యంలో నిర్వహించారు.

# ఏప్రిల్ 12న మెగా మాక్ టెస్ట్ నిర్వహణ

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- యువతకు రాత పరీక్షతో పాటు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహణ
- ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు
- పెద్దపల్లి యువశక్తి ప్రోగ్రామ్‌లో మెగా మాక్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి,ఏప్రిల్ 09(జనంసాక్షి) :** యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, పోలీస్ ఉద్యోగాల సాధనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో "పెద్దపల్లి యువశక్తి ప్రోగ్రామ్" లో భాగంగా నిర్వహించనున్న మెగా మాక్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా యువత పోలీస్ విభాగంలో ఎస్సై కానిస్టేబుల్ , ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు సన్నద్ధం కావడానికి ఈ మెగా మాక్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ పోలీస్ నియామక పరీక్షల విధానంలోనే రాత పరీక్ష నిర్వహించడంతో పాటు అభ్యర్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించే విధంగా ఫిజికల్ ఈవెంట్స్ కూడా నిర్వహించబడతాయని తెలిపారు. ఈ మెగా మాక్ టెస్ట్ ఈ నెల 12వ తేదీ ఆదివారం రోజున జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, సీఈఆర్ క్లబ్, గోదావరిఖనిలో ఉదయం 6:00 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా లో పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.రాత పరీక్షలో 1వ బహుమతి రూ.10,000, 2వ బహుమతి రూ.5,000, 3వ బహుమతి రూ.2,000, 4వ బహుమతి రూ.1,000 ఇవ్వబడుతాయని తెలిపారు. అలాగే ఫిజికల్ ఈవెంట్స్‌లో కూడా అదే విధంగా బహుమతులు అందజేయబడతాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఈ నెల



10వ తేదీగా నిర్ణయించబడినదని, అభ్యర్థులు ఞ= కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9949725997, 9573688952, 8333044460 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.జిల్లావ్యాప్తంగా యువత ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ ప్రతిభను నిరూపించుకొని పోలీస్ ఉద్యోగాల సాధనలో ముందడుగు వేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, లెంకల మహిపాల్ రెడ్డి (ఎక్స్ ఆర్మీ), యంగ్ ఇండియా మిషన్ సభ్యురాలు శ్వేత రెడ్డి, సిరిప్రియా దర్శిని తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు సీఐటీయూ మద్దతు

**పెద్దపల్లి,ఏప్రిల్ 09(జనంసాక్షి) :** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టీవీఏఈజేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు సీఐటీయూ పూర్తి మద్దతు ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిజన్ కార్మికులు సమ్మె చేపట్టారు. పెద్దపల్లి సర్కిల్ కార్యాలయం ముందు జరుగుతున్న సమ్మెలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి. జ్యోతి, సీపెల్లి రవీందర్ శుక్రవారం హాజరై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఆర్టిజన్ల నిరవధిక సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికుల పట్ల ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వరంగల్ ఎన్పీడీసీఎల్ ముందు వేలాది మందితో మహాధర్నా చేసినా స్పందించకపోవడం ప్రభుత్వ మొండివైఖరికి నిదర్శన మన్నారు. ఒకే సంస్థలో రెండు రకాల సర్వీస్ రూల్స్ అమలు చేస్తూ వివక్ష చూపడం



దారుణమన్నారు. అర్హత కలిగిన కార్మికులకు వెంటనే కన్వర్షన్ ఇవ్వాలని, అన్ మాన్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జీఓ 11 ప్రకారం పీస్ రేట్, స్పాట్ బిల్లింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు సీఐటీయూ అండగా ఉంటుందని, అవసరమైతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి, ఎల్లయ్య, నర్సయ్య, నరేష్, కొండయ్య, జడలు సత్యనారాయణ, కాళీం, మాంకాళి రాజు,చిన్నయ్య, రమేష్,జగన్,రాజు,తదితరులు పాల్గొన్నారు.

### 2 పాడి గేదెల పెంపకం పథకం దరఖాస్తు గడువు

# ఏప్రిల్ 16 వరకు పొడిగింపు

- కార్యనిర్వహక సంచాలకులు జి. శ్రావణ్ కుమార్

**పెద్దపల్లి,ఏప్రిల్ 09(జనంసాక్షి) :** వార్షిక ప్రణాళిక 2025-26 సంవత్సరానికి గాను జిల్లాలో అమలు చేస్తున్న 2 పాడి గేదెల పెంపకం పథకానికి సంబంధించి ఆన్లైన్ దరఖాస్తుల గడువును ఏప్రిల్ 16 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ లిమిటెడ్ కార్యనిర్వహక సంచాలకులు జి. శ్రావణ్ కుమార్‌లి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే ఆన్లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు సంబంధిత మున్సిపల్ , మండల పరిషత్ కార్యాలయాల్లో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.పథకానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, కుల ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది), పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.అదేవిధంగా, పాడి గేదెల పథకం కోసం కనీసం 10 గుంటల భూమి కలిగి ఉండటం తప్పనిసరి అని పేర్కొన్నారు.కావున ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 16 లోపు హెచ్ టి టి పి ఎస్//టి జి బి ఓ ఎం ఎస్.సీజ్ గౌ ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వహక సంచాలకులు ఆ ప్రకటనలో తెలిపారు.

## నిట్టూరు గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**పెద్దపల్లి,ఏప్రిల్ 09(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలం నిట్టూర్ గ్రామంలో గురువారం ప్రజా పాలన ప్రజా ప్రణాళిక భాగంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రాగినేడు (పి హెచ్ సి) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆకుల సువర్ణ-శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి(65) మంది గ్రామ ప్రజలకు బిపి షుగర్, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన వైద్య బృందానికి, పాలకవర్గానికి, గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేల్పురి సంతోష్ రావు, వార్డు సభ్యులు డాక్టర్ శ్రావణ్ కుమార్, (ఎంఎల్ హెచ్ పి) డాక్టర్ సుస్మిత, ఎన్ సి పి. నర్సింగ్ ఆఫీసర్, ఏఎన్ఎం తిరుమల, సెక్రటరీ శరత్ బాబు, కారోబార్ కనకయ్య, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కు ఎంపికైన రొండి నిశాంత్

**వేములవాడరూరల్ ఏప్రిల్ 9 (జనంసాక్షి):** వేములవాడ రూరల్ మండలం నాగాయపల్లి చెందిన రొండి నిశాంత్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు బోయినపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంజి విశ్వనాథం గురువారం తెలిపారు. ఈనెల 11 న హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచి అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్ సాధించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. నిశాంత్ ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని పేర్కొంటూ, శుభాకాంక్షలు తెలిపారు.



# గ్యాస్ సరఫరా పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలి: కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందనకు వ్యవస్థ బలోపేతం

**పెద్దపల్లి,ఏప్రిల్ 09(జనంసాక్షి) :** జిల్లాలో గ్యాస్ సరఫరా పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తూ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్యాస్ సరఫరా అంశంపై లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్లు జె. అరుణ శ్రీ, డి. వేణు, డిసిపి రాంరెడ్డిలి లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్యాస్ సరఫరా సంబంధించి జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వైస్ చైర్మన్ గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కమిటీలో జిల్లా అటవీ అధికారి, ఎన్.హెచ్.ఏ.ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ కమిషనర్, ఐఓసిఎల్ ప్రతినిధి సహా మొత్తం 14 మంది సభ్యులు ఉంటారని తెలిపారు.ఐఓసిఎల్ ఆధ్వర్యంలో జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో గ్యాస్ ప్రాజెక్ట్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందులో సి.ఎన్.జి స్టేషన్లు, డొమెస్టిక్, ఇండస్ట్రియల్, కమర్షియల్ కనెక్షన్ల ఏర్పాటు జరుగుతోందన్నారు. ప రామగుండంలో 3 సి.ఎన్.జి స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.రామగుండం నుంచి కరీంనగర్ వరకు 50 కిలోమీటర్ల పైపులైన్ పనులు ప్రారంభించగా, అందులో 20 కిలోమీటర్లు పూర్తయ్యాయని, మిగిలిన 30 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.గ్యాస్ పైపుల ఏర్పాటుకు అనుమతులలో ఆలస్యం, రోడ్డు మరమ్మత్తు ఛార్జీలు, పని వేళల పరిమితులు వంటి అడ్డంకులను తొలగించి ప్రాజెక్టును వేగవంతం చేయడం కమిటీ ప్రధాన బాధ్యత అని తెలిపారు.గ్యాస్ సరఫరా, నిల్వలు, పంపిణీ



ప్రక్రియలో అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు ఆదేశించారు. గ్యాస్ సరఫరా కు ఎలాంటి అంతరాయాలు లేకుండా సజావుగా కొనసాగేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ నరేందర్, ఈ ఈ ఆర్ అండ్ బి బావ్ సింగ్ , జిల్లా పరిశ్రమల అధికారి కీర్తి కాంత్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, మనోహర్, జిల్లా అటవీ శాఖ అధికారి, శివయ్య , జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ట్రాక్టర్ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా రాజ్ కుమార్

**ముత్తారం ఏప్రిల్ 08 (జనంసాక్షి)**
గ్రామ ట్రాక్టర్ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా దొడ్ల రాజ్ కుమార్ ఉపాధ్యక్షుడిగా కాల్వచేర్ల సతీష్ ఎన్నికయ్యారు. గురువారం ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ రాపెల్లి రాజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు,ఉపాధ్యక్షుడు తోపాటు కమిటీ సభ్యులను ఎన్నికయ్యారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ట్రాక్టర్ యజమానుల బలోపేతం చేసి సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు అన్నారు. సంఘ అభివృద్ధితో పాటు,సంఘ సంక్షేమానికి,గ్రామ అభివృద్ధికి,ప్రజా సంక్షేమం కొరకు పాటు పడుతామని హామీ ఇచ్చారు.ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కందునూరి ప్రశాంత్,తిత్తుల శ్రీనివాస్,కొంకటి అనిల్,అనుముల మొగిలి,ఇనుముల కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

### వంతుల వారి గ్రామ సేవకులందరినీ
## యధావిధిగా పనుల్లోకి తీసుకోవాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (జనం సాక్షి)**
వంతుల వారి గ్రామ సేవకులనందరినీ యధావిధిగా పనుల్లోకి తీసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా జిపిఓలుగా అటెండర్లుగా వెళ్ళిన వారు వంతుల వారి పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని, సి ఐ టి యు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.సి ఐ టి యు ఆధ్వర్యంలో కలెక్టర్ కు గ్రామ సేవకులు మెమోరండం అందజేశారు.అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామిణ ప్రాంతాలలో వంశపారపర్యంగా సుంకరీ పని నీరడి పని చేసిన ఎస్సీ ఎస్టీ బీసీ కార్మికులను యధావిధిగా పనుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు అలాగే గ్రామ సేవకుల నుండి ప్రభుత్వ ఉద్యోగులుగా జిపివోలుగా అటెండర్లుగా వెల్లినవారు వంతుల వారి గ్రామ సేవకులకు సంఘంలో గానీ కులంలో గానీ కూర్చుని మాట్లాడుకున్నదాని ప్రకారం పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.తరతరాల నుండి తాత ముత్తాతల నుండి వంశ పారంపర్యంగా వస్తున్న వృత్తిని చదువుకున్న వాళ్ళు బతకనీలే అనే పెద్ద మనసుతో పనిని వదులుకొని ఊరికి ఒక్కరిని జిపివోలుగా వీఆర్వోలుగా ఎక్కిస్తే చాలామంది మాట్లాడుకున్న అగ్రిమెంట్ ప్రకారం డబ్బులు చెల్లించకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు ఇది చాలా అన్యాయమైన పని కాబట్టి వెంటనే మాట్లాడుకున్న దాని ప్రకారం ఏ గ్రామంలో పెండింగ్ ఉన్నదో వారు కచ్చితంగా తొందర్లోనే క్లియర్ చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాజ్వీర్, రవి, శేఖర్ సాయిలు, అనిల్, గోపి, సాయిలు, పోచయ్య, రాజయ్య, నర్సింలు, మరియు గ్రామ సేవకులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అమృత కలశాల పంపిణీ

**యైటింక్లయిన్ కాలనీ ఏఫ్రిల్ 09 (జనంసాక్షి) :**



పట్టణములోని శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో గురువారం నారాయణ సేవలో భాగంగా నిరుపేద చిన్నారులకు, మహిళలలకు దస్తులు, ముగ్గురికి 16 రకాల వంట వంట సామాగ్రి అమృత కలశాలను పంపిణీ చేయడం చేశారు. ప్రతినెల నిరుపేదలను గుర్తించి వారికి నెలకు సరిపడే వంట సామాగ్రి అందజేయనున్నట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎ. సుబ్బారావు, లింగమూర్తి అనంతుల రాజు, లక్ష్మీనారాయణ, కిష్టయ్య, రాజమహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు'
## అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలంపియాడ్ లో బంగారు పతకాలు

**కరీంనగర్, ఏప్రిల్ 09 (జనంసాక్షి):**
విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పట్ల అవగాహన ఉండాలని, వాటిలోని విషయాల పట్ల పట్టు సాధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులకు అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలంపియాడ్లో బంగారు పతకాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి విద్యార్థికి సోషల్ స్టడీస్ పట్ల అవగాహన ఉండాలని వాటిలోని విషయాలను విశ్లేషణాత్మకంగా తెలుసుకొని వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీ పరీక్షలకు హాజరై విజయాలను నమోదు చేయాలని చెప్పారు.
సాంఘిక శాస్త్రం ద్వారా పోటీ పరీక్షలలో సైతం విజయాలను చాలా సులభంగా సాధిస్తారని, సాంఘిక శాస్త్రంలోని విషయాలు కేవలం పోటీ పరీక్షలకే కాకుండా సామాజిక అవగాహన పెంపొందించుటకు చాలా ఉపకరిస్తాయని చెప్పారు. ఈ నిర్వహణలో భాగంగా ఇటీవల కాలంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయినా సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలింపియాడ్ లో పాఠశాలకు చెందినటువంటి పలువురు విద్యార్థులు బంగారు పతకాలతో పాటు రజత పతకాలను




సాధించడం చాలా గొప్ప విషయం చెప్పారు.

**విజేతల వివరాలు**
కోలా అతిథి కిషన్, వి.వేద విహార్, బి. కార్తికేయ గౌడ్, విగ్నేష్ , హెచ్.శ్రీహాన్, చైతన్య తదితరులు బంగారు పతకాలతో పాటు సర్టిఫికెట్లను గెలుచుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులందరికీ పుష్పగుచ్ఛాలను అందజేసి భవిష్యత్తులోను మరిన్ని విజయాలను నమోదు చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఏప్రిల్ 14న నిర్వహించు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి
## వేడుకలలో పాల్గొని విజయవంతం చేయాలి

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి,ఏప్రిల్ 09(జనంసాక్షి) :**
ఏప్రిల్ 14న జిల్లా కేంద్రంలో నిర్వహించు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలలో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏప్రిల్ 14న ఉదయం గం.10-00 లకు బస్ స్టాండ్ వద్ద అంబేద్కర్ చౌరస్తా లో నిర్వహించు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

™|ŠY|Y˜¢,@¦¾|Ù09(Ğ¦ķĞÚ) :
పెద్దపల్లి జిల్లాలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు.. ఈ శిబిరంలో సామాజిక సేవకుడు పాంపాటి శ్రీకాంత్ పాల్గొని రక్తదానానికి ప్రజలను ప్రోత్సహించారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌కు చెందిన బోడకుంట రామకృష్ణ, సాయిలు మరియు రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన కావేటి రాజగోపాల్, అనిల్, రాజకుమార్, శ్రవణ్, సాయి, సాయి రాకేష్, మహేష్, లక్ష్మణ్, తాజ్ బేగ్, గుండా సాయి వర్మ, శ్రీనివాస్, మహేష్, వెంకటేశ్వర రావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.





### ఈనెల 14న హనుమకొండలో
## బీఎస్పీ భారీ బహిరంగ

**- ఇరుకుల్ల రాజనర్సయ్య. (జిల్లా అధ్యక్షుడు)**

**పెద్దపల్లి,ఏప్రిల్ 09(జనంసాక్షి) :**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్క రించుకొని ఈనెల 14న హనుమకొండలోని కేడీసీ గ్రౌండ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల రాజనరసయ్య వెల్లడించారు.గురువారం జిల్లా కేంద్రంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ సభకు సంబంధించిన గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు.అనంతరం ఇరుకుల్ల రాజనరసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ జోన్ ఇంచార్జి వరికిల్ల మల్లేష్ పాల్గొని మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుండి పార్టీ నాయకులు,కార్యకర్తలు,అంబేద్కర్ వాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నార్ల గోపాల్ యాదవ్,సీనియర్ నాయకులు పెగ నరేష్,కాదాసి రవీందర్,మంథని నియోజకవర్గ ఇంచార్జ్ జనగామ రవికుమార్,పెద్దపల్లి నియోజకవర్గ కోశాధికారి మల్లారపు రవీందర్,రామగుండం నియోజకవర్గ ఇంచార్జి జింక ఉదయ్,అధ్యక్షులు జనగామ లింగయ్య,ఎల్ల స్వామి,కార్పొరేషన్ అధ్యక్షులుబివిఎఫ్ విష్ణు,నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**వేములవాడ,ఏప్రిల్9(జనంసాక్షి):**
ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో మాతృశ్రీ మల్టీస్పెషల్టి హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిం చనున్నారు. వేములవాడ పట్టణంలోనీ మున్నూరు కాపు సత్రంలో శు క్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నాం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ రేడియలజిస్ట్ డాక్టర్ చెన్నమనేని వికాస్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు సేవలు అందించనున్నారు. బీపీ, షుగర్, గుండె,కంటి, ఎముకలు, మహిళల ఆరోగ్య సమస్యలకు ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు అలాగే 2-డి ఈకో, ఎక్స్-రే, మామోగ్రఫీ, ఈసీజీ వంటి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాలలో ఘనంగా జాబ్ మేళా

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 9 ( జనంసాక్షి)**

కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో టీఎస్‌కేసీ (ఖాఐఅ) ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ జాబ్ మేళాలో కళాశాల వివిధ విభాగాలకు చెందిన సుమారు 460 మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల చురుకుదనం, ఆసక్తి ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్, అకాడమిక్ కోఆర్డినేటర్ తాళ్లపల్లి రాజయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హరిజోత్ కౌర్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సతీష్ కుమార్, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ కే. సుధాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్ మాట్లాడుతూ, విద్యార్థులు జాబ్ మేళా అవకాశాలను సద్వినియోగం చేసుకుని డిగ్రీ అనంతరం స్థిరమైన ఉద్యోగాలను సాధించాలని సూచించారు. అకాడమిక్ కోఆర్డినేటర్ తాళ్లపల్లి రాజయ్య మాట్లాడుతూ, కళాశాలలో



చదువుతూనే ఉద్యోగ అవకాశాలను అందించే వేదికగా జాబ్ మేళాలు మారుతున్నాయని తెలిపారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హరిజోత్ కౌర్ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో త్వరగా స్థిరపడవచ్చని పేర్కొన్నారు. టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సతీష్ కుమార్ ఈ జాబ్ మేళాలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం ఆనందదాయకమని అభిప్రాయపడ్డారు. ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ కే. సుధాకర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని కంపెనీలు అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధ్యాపక బృందం, టీఎస్‌కేసీ ప్లేస్మెంట్ సెల్, మెరీనా పెయింట్స్ యాజమాన్యం మరియు పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు.

## నేడు హిందూ సమ్మేళన - సన్నాహక సమావేశం..

**గన్నేరువరం, ఏప్రిల్ 09 (జనంసాక్షి):**

గన్నేరువరం మండలకేంద్రంలోని శుక్రవారం 10 గంటలకు వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో తిమ్మాపూర్ ఖండ, గన్నేరువరం ఉప మండలం గ్రామాలు గన్నేరువరం,చొక్కారావుపల్లె,పారువెళ్ల, ఖాసీంపేట,మాదాపూర్,సాంబయ్య పల్లె, చాకలివానిపల్లె, మైలారం గ్రామాల నుండి పార్టీలకు అతీతంగా హిందువులందరూ హిందూ సమ్మేళన - సన్నాహక సమావేశానికి హాజరై విజయవంతం చేయగలరని అలాగే హిందూ నూతన కమిటీని ఎన్నుకుంటారని హిందూ కమిటీ సభ్యులు తెలిపారు.

## కామారెడ్డి లో ఘనంగా ఎన్ఎస్ యుఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (జనం సాక్షి)**

కామారెడ్డి పట్టణంలో ఎన్ ఎస్ యు ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదేశాల మేరకు ఎన్ ఎస్ యు ఐ ను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు ఐరేణి సందీప్ ఆధ్వర్యంలో కామారెడ్డి నియోజకవర్గ కార్యాలయం వద్ద ఎన్ ఎస్ యు ఐ జెండాను ఎగరవేశారు. అనంతరం కామారెడ్డి డైరీ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి ఎన్ ఎస్ యు ఐ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఐరేణి సందీప్ మాట్లాడుతూ,1971లో మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నేతృత్వంలో ఎన్ ఎస్ యు ఐ స్థాపించబడిందని తెలిపారు. విద్యార్థుల హక్కులు, సంక్షేమం కోసం ఈ సంస్థ నిరంతరం పోరాటం చేస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఎన్ ఎస్ యు ఐ మరియు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి ని కొనియాడారు. వారి మార్గదర్శకత్వంలో విద్యార్థి ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు అందుగుల అనిల్, రోషన్, శ్యామ్ టింకు, విద్యార్థులు రంజిత్, విజయ్, సంజయ్, అనీష్, రోహిత్, సుజిత్, కుశాల్, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 23,000 విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు శాశ్వత నియామకాలు చేయాలంటూ బాన్సువాడలో బిఆర్ఎస్ మద్దతుతో ధర్నా

**బాన్సువాడ ఏప్రిల్ 9 (జనంసాక్షి)**

బాన్సువాడ : రాష్ట్రవ్యాప్తంగా 23,000కు పైగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగాలలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాన్సువాడ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట రెండోవ రోజు కూడా ధర్నా కొనసాగింది. ఈ ధర్నాకు బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ మాట్లాడుతూ? ప్రతి రోజు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్న విద్యుత్ కార్మికుల భవిష్యత్తు భద్రత ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. వెంటనే పర్మినెంట్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ రైతు బంధు జిల్లా అధ్యక్షులు అంజి రెడ్డి, ఏఐబిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బోడ రామ్ చంద్ర్, కౌన్సిలర్లు ఖలీల్ ఖాన్, ఫెరోజ్ ఖాన్, మాజీ కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు అక్బర్, మైనారిటీ సెల్ నాయకుడు ఇషాక్, నాయకులు రమేష్ యాదవ్, మన్నే అనిల్ కుమార్, కార్మిక సంఘ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాన్సువాడ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

**బాన్సువాడ ఏప్రిల్ 9 (జనంసాక్షి)**

బాన్సువాడ : ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డిని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రి సేవలను మెరుగుపరుస్తున్నందుకు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో లో జిల్లా పరిషత్ సభ్యుడు శివ ప్రసాద్, కౌన్సిలర్లు గజ్జల మహేష్, పాశం భాస్కర్ రెడ్డి, సామల శ్రీకాంత్, బీజేపీ నాయకుడు చీకట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ లను అందజేత

**కథలాపూర్ ఏప్రిల్ 9(జనం సాక్షి )**

కథలాపూర్ మండలకేంద్రంలో గత కొన్ని రోజుల క్రితం తమ యొక్క మొబైల్ ఫోన్ లు పోయినవని గాంధారి శ్రీనివాస్ సిరికొండ మరియు దుంపేట లక్ష్మి పెగ్గెర్ల అనువారు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వగా, అట్టి ఫిర్యాదును సి ఈ ఐ ఆర్ పోర్టల్ నందు నమోదు చేయగ ఈరోజు అట్టి సెల్ ఫోన్ లు రికవరీ కాగా, వాటిని యజమానులకు అందజేసినట్లు కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ తెలియజేసినారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కథలాపూర్ మండల పరిధిలోని ఎవరిదైనా మొబైల్ పోగొట్టుకొన్న ఎడల సి ఈ ఐ ఆర్ పోర్టల్ నందు నమోదు చేసిన లేదా పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేసిన అట్టి సెల్ ఫోను తిరిగి అప్పగించబడును అని తెలిపినారు.




# సమాజ సేవలో ముందుండాలి

## ధన్ పాల్ లక్ష్మి బాయి, విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంబలి కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే...

**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 09 (జనంసాక్షి):**

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ధన్ పాల్ లక్ష్మి బాయి, విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పీఎల్ఎంఎస్ పెట్రోల్ బంక్ ఎదురుగా అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నగరవాసుల సౌకర్యార్థం అంబలి పంపిణీ చేస్తున్నామన్నారు. ఎండ దెబ్బ, వేడి నుంచి అంబలి ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఇట్టి కేంద్రాన్ని గత 12 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారని, నాలుగేళ్లుగా తమ ట్రస్ట్ సహకరిస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా గ్రామీణులు అధిక సంఖ్యలో వస్తారని, వారికి ఆసరాగా ఉంటుందనే ఉద్దేశ్యంతో అంబలి పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా



కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబలి కేంద్ర ప్రతినిధి పార్శి రమేష్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీ నారాయణ, బట్టు రాఘవేందర్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, మల్కాయి మహేందర్, మఠం పవన్, మల్లేష్ యాదవ్, కల్పె అర్చన చిరంజీవి, ఎర్రం ప్రభాకర్, గజవాడ ఆగమయ్య, మంచొల్ల రామస్వామి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.